సమాగమం

సూర్యాస్తమయ సమయం. అరణ్యం ఒక పక్క ఎర్రని కాంతితో, మరోపక్క కమ్ము కొస్తున్న చీకట్లతో నల్లని పొగలూదుతూ మండిస్తున్న ఎర్రని కొలిమిలా ఉంది. పక్షులు గుంపులు గుంపులుగా గూళ్ళకు చేరుతున్నాయి. వాటి అరుపులతో వనమంతా సందడిగా ఉంది. లేళ్ళ గుంపులు పగటి బద్ధకాన్ని ఒదిలించుకుని హుషారుగా వెన్నెల విహారానికి సిద్ధమవుతున్నాయి. ఆ దట్టమైన అరణ్యంలో అతి ప్రశాంతంగా, ముచ్చటగా, ప్రతిభావంతుడైన చిత్రకారుని సృష్టిలా ఉంది ముని ఆశ్రమం.

ఆశ్రమంలో సాయం సంధ్యా కార్యక్రమాలు మొదలయ్యాయి. అగ్నిహోత్రాలు వెలుగు తున్నాయి. గంభీర మంత్రనాదాలు మధురంగా వినపడుతున్నాయి. మునికాంతలు ఫలపుష్ప తరువులకు నీళ్ళుపోసి సేదదీరుతున్నారు. కొందరు దైవ పూజ కోసం మాలలల్లు తున్నారు. పిల్లలు అరణ్య సంచారం చేసి తిరిగివచ్చి తమకోసం ఆతృతగా ఎదురుచూస్తున్న తల్లుల కౌగిళ్ళలో చిక్కుబడి ఉన్నారు. కొందరు తల్లులు పిల్లలను సాయం సమయ అనుష్టానాల కోసం త్వరపెడుతున్నారు. అక్కడ ఒక చిన్న కుటీరంలో ఒక తల్లి అరణ్య సంచారం నుంచి ఇంకా తిరిగిరాని తన పిల్లలకోసం ఎదురు చూస్తూ నిల్చుంది. ఆ పిల్లల మీదనే ఆమె ప్రాణాలన్నీ పెట్టి బతుకుతున్నట్లు ఆమె కళ్ళవంక చూస్తే అర్థమవుతుంది. ఆ కళ్ళలో ఆతృత, ఆర్తి. దయ కురిపించే ఆమె కళ్ళ నిండుగా భయం చోటు చేసుకుంది.

ఆ తల్లి పేరు సీత.

తన ఇద్దరు కుమారుల కోసం ఎదురు చూస్తోంది.

రోజూ ఈ సమయానికి ఇద్దరూ అరణ్యం నుంచి తిరిగి వచ్చేవారు. వస్తూ వస్తూ ఏవో అడవిపూలు తెచ్చేవారు. వాటిని దేవతార్చనకు ఉపయోగించమని తల్లిని బతిమాలే వారు. పేరు తెలియని పూలతో పూజ చేయనని సీత అనేది. వాళ్ళిద్దరూ కలిసి ఆ పూలకు చిత్రవిచిత్రమైన పేర్లు పెట్టేవారు. సీత నవ్వుతుంటే వారు అలిగేవారు. సీత వాళ్ళిద్దరినీ బుజ్జగించి ఆ పూలతో పూజచేసి వాళ్ళను సంతోష పెట్టేది. చీకటి చిక్కబడే వేళకు బాలకులిద్దరూ కంఠమెత్తి పాడుతుంటే వనమంతా పరవశించి వింటుంది.

ఆ లవకుశులు ఇంకా తిరిగి రాలేదు. సీత మనసు ప్రమాదాన్ని శంకించటం లేదు, లవకుశులకు అడవి కొట్టిన పిండి. వాళ్ళు అక్కడే పుట్టారు, అక్కడే పెరిగారు. వాళ్ళు అరణ్యపుత్రులు. కానీ ఆలస్యానికి కారణమేమిటి? అది తెలియకే భయ సందేహాలు. లవకుశులు అయోధ్య వెళ్ళివచ్చిన నాటినుంచీ సీత మనసులో పిల్లల గురించి అంతకు ముందు లేని ఆందోళన చోటు చేసుకుంది. ఏదో తెలియని అలజడి మనసులో. ఇప్పుడూ అదే అలజడి. అరణ్యం గురించి కాదు నగరం గురించే - క్రమంగా చీకట్లు దట్టమయ్యాయి. సీత కళ్ళే దీపాల్లా వెలుగుతున్నాయి.

ఇంతలో ఆ దీపాల కాంతిలోకి ఇద్దరు బాలకులు వచ్చి చేరారు. సీత ఒక్క నిట్టూర్పు విడిచి ఇంత ఆలస్యమయిందేమని ప్రశ్నించింది. లవుడు "అమ్మా ఇటు చూడు" అంటూ తన పైకండువాలో కట్టుకొచ్చిన పూలను పళ్ళెంలో పోశాడు. క్షణంలో పర్ణశాల మున్నెన్నడూ ఎరుగని సుగంధంతో నిండిపోయింది.

పూలు. ఎర్రని, తెల్లని, పచ్చని పూలు పళ్ళెంనిండా నవ్వుతున్నాయి. అవి ఎన్నడూ చూడని పూలు. ఆ పరిమళం పూర్వం ఎరుగనిది. కుశలవులిద్దరూ తాము సాధించిన ఆ పుష్ప విజయానికి గర్విస్తున్నట్టు తల్లివైపు చూశారు.

"ఎక్కడివిరా ఈ పూలు. ఎంత బాగున్నాయి" అంది సీత వాటిని వేళ్ళతో సున్నితంగా స్పృశిస్తూ.

"అమ్మా ఇవాళ అడవిలో ఒక కొత్త ఉద్యానవనం కనుగొన్నాము. అలాంటి ఉద్యానవనం ఎక్కడా చూడలేదు. వాల్మీకి తాతయ్య వర్ణించే నందనవనం కూడా దీనిముందు దిగదుడుపే" అన్నాడు కుశుడు.

లవుడు అన్న మాటను సమర్థిస్తున్నట్లు కళ్ళతోనే ఆమోదాన్ని తెలిపాడు.

"ఎవరి ఉద్యానవనం అది కుశా" అడిగింది సీత.

"అమ్మా ఆ ఉద్యానవనమెంత సుందరమో దాని యజమాని రూపమంత వికారం. మేం పూలు కోసుకుంటూ ఉంటే ఆమె వచ్చింది. మేం భయపడ్డాం. అన్నయ్య ఎలాగో

ధైర్యం తెచ్చుకుని 'మేం ముని బాలకులం. పూజకు పూలు కోసుకున్నాం' అని చెప్పాడు. మేం వడివడిగా వచ్చేశాం. అబ్బా ఆ రూపం పరమ వికారం. ఒట్టి కురూపి" వెగటుగా చెప్పాడు లవుడు.

"తప్పు నాయనా. మనుషుల ఆకారాలను చూసి వారిని అసహ్యించుకోరాదు. ఆమె కురూపి అయినా ఎంతో మంచి పూల తోట పెంచింది కదా" అంది సీత.

"ఆమె మనిషంతా బాగానే ఉందమ్మా. కానీ ముక్కూ చెవులూ లేవు. ఎవరో కోసినట్టు అక్కడంతా పెద్దలొట్ట" కుశుడు ముఖం చిట్లించుకున్నాడు.

సీతకు ఒక్కసారి తన వీపుమీద ఎవరో కొరడా ఝుళిపించినట్లయింది.

"ముక్కూ చెవులూ లేవా?"

"లేకపోవటమంటే – ఒకప్పుడు ఉండేవేమో. ఎవరో కోసేశారు. అలా అనిపించింది కదన్నయ్యా" కుశుని సాక్ష్యం కోరాడు లవుడు.

సీతకిప్పుడు నిశ్చయమే.

ఆమె శూర్పణఖ. తప్పకుండా శూర్పణఖే.

పద్దెనిమిదేళ్ళ నాటి మాట. రాముడిని వలచి వచ్చింది. ఎంత అందమైన మనిషో. రామలక్ష్మణుల క్రూరమైన పరిహాసానికి పాపం కురూపియైపోయింది. ఇప్పుడా శూర్పణఖ ఈ అరణ్యంలోనే ఉందా? ఎంత కాలం గడిచింది!

శూర్పణఖను రాముడు అవమానిస్తే రావణుడు తననపహరించి రాముడిమీద ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు.

పురుషుల పగలూ ప్రతీకారాలూ తీర్చుకోవటానికేనా స్త్రీలుంది?

రావణుడి చెల్లెలని తెలియకపోతే రామలక్ష్మణులు శూర్పణఖనట్లా చేసేవారు కాదు. రావణుని రెచ్చగొట్టాలనే రాముడి అభిమతం, అతనితో కయ్యానికి కారణం కోసం వెతుకుతున్న రాముడి అన్వేషణ శూర్పణఖ వల్ల నెరవేరింది.

అదంతా రాజకీయం.

పాపం శూర్పణఖ ప్రేమ ప్రేమ అంటూ పలవరిస్తూ వచ్చింది. ముక్కూ చెవులూ లేని ఆ కురూపిని ఇంకెవరు ప్రేమిస్తారు?

జీవితమంతా ప్రేమ రాహిత్యంలోనే గడిపిందా?

తనలోని ప్రేమనంతా రంగరించి ఆ పూలతోట పెంచిందా?

తన సౌందర్య కాంక్షకు ఫలంగా ఉద్యానవనాన్ని రూపుదిద్దిందా?

ఆమె హృదయ సౌకుమార్య ప్రతిఫలనాలా ఈ పూలు.

పాపం శూర్పణఖ.

సీత కళ్ళల్లో నీళ్ళు చూసి లవకుశులు ఆశ్చర్యపోయారు.

"ఏంటమ్మా ఇది. ఎవరి అనాకారితనం గురించో విన్నంత మాత్రాన ఇంత బాధ పడతా వెందుకమ్మా".

సీత కళ్ళు తుడుచుకుని చిన్నగా నవ్వి -

"రేపు నన్ను ఆ ఉద్యానవనానికి తీసుకెళ్తారా?" అనడిగింది.

లవకుశులు నమ్మలేనట్లు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"నిజంగా నేను మీతో వస్తాను. తీసుకెళ్తారా? ఆ మార్గం గుర్తుందా?"

సీత మాటలకు అన్నదమ్ముల సంబరం నింగినంటింది.

అమ్మ తమతో అరణ్య విహారానికి వస్తుందనుకుంటే వాళ్ళ మనసులు ఉప్పొంగి పోయాయి. తమకు సుపరిచితమైన అరణ్య ప్రాంతాలన్నీ తల్లికి చూపించాలని ఇద్దరికీ కుతూహలం. కానీ సీత ఎన్నడూ రాదు. ఎప్పుడన్నా వెళ్ళినా తోటి మునికాంతలతో కలిసే. అమ్మ చేతులు పట్టుకుని ఆ దుర్గమారణ్యంలో సంచరిస్తామనీ, అమ్మ భయపడకుండా ధైర్యం చెబుతామనీ, వింతలన్నీ చూపుతామనీ అనుకుంటే ఆ చిన్నారులకు ఉత్సాహం ఆగటం లేదు.

ఆ రాత్రి ఎప్పుడు తెల్లవారుతుందో గదా అనుకున్నారు.

ఆ రాత్రి సీతకు కూడా భారంగానే గడిచింది. గత కాలపు జ్ఞాపకాలు ఎంత తోసివేసినా ముందుకొచ్చి నిల్చున్నాయి.

రాముడితో ఆనందంగా గడిపిన ఆ అరణ్యవాసపు రోజులు.

శూర్పణఖ రాక - ఎంత మనోహరంగా నడచి వచ్చిందో. తలలో తెల్లని మల్లెలు. మెడలో పచ్చగన్నేరు పూలహారాలు. చేతులకు నీలాంబరాల మాలలు. ఒక కదిలే పూల తీగలా వచ్చింది. తన ఆభరణాల వంక చిత్రంగా చూసింది.

పరిమళంలేని, సౌకుమార్యం లేని ఆ బరువులెందుకు మోస్తున్నావన్నట్లే చూసింది. తనను చూడటమేగాని మాటలు లేవు. సరాసరి రాముడి దగ్గరకు వెళ్ళింది. తను వీళ్ళ మాటల మీద ధ్యాస ఉంచే ఏదో పని చేసుకుంటోంది. కొద్దిసేపు గడిచేసరికి ఆశ్రమంలో రక్తపాతం.

ఒక స్త్రీ హృదయ విదారక రోదన.

ఎంత శపించిందో ఆ చర్యకు.

ఆ శాపం ఇంకా తనను వీడినట్లు లేదు.

ఆమెను ఏ పురుషుడూ ప్రేమించడు.

తనను ప్రేమించే పురుషుడు తనను దూరం చేశాడు.

ఇద్దరి కథలూ చివరికి ఒకటేనా?

తనను చూసి శూర్పణఖ ఏమంటుంది?

తనమీద కోపంతో మాట్లాడదేమో - అయినా చూడాలి. శూర్పణఖను చూడాలి.

***

మర్నాడు ఉదయం పనులన్నీ పూర్తయ్యాక సీతను వెంటబెట్టుకుని లవకుశు లిద్దరూ బయలుదేరారు.

"అమ్మా ఇవాళ నీకు నా రాజాని చూపుతాను" అన్నాడు లవుడు.

అరణ్యంలో స్వేచ్ఛగా తిరిగే మత్తగజం లవుడికి వశమైంది.

దానిపై నెక్కి అన్నదమ్ములు విహరిస్తారు.

"అమ్మా నువ్వూ రాజాను ఎక్కవా?" మురిపెంగా అడిగాడు లవుడు.

"ఒద్దమ్మా. నాకు నడవటమే ఇష్టం" అంది సీత. పట్టపుటేనుగుపై ఊరేగిన రోజులను తలుచుకుంటూ.

సీతకు ఏనుగంటే భయమనుకున్నారు అన్నదమ్ములు.

"పాపం అమ్మకు ఏనుగెక్కటం ఎలా వస్తుంది? భయం కూడా" లవుడిని కోప్పడ్డాడు కుశుడు.

తమకు అడవిలో మాలిమి అయిన జంతుజాలాన్నంతా తల్లికి పరిచయం చేస్తూ నడిపించారు.

పిల్లల మాటలతో మార్గాయాసమే తెలియలేదు సీతకు.

"ఇదేనమ్మా ఆ ఉద్యానవనం".

సీత నిలబడిపోయింది. ప్రకృతి మధురహాసంలాంటి ఆ తోటను చూస్తే సీత నోట మాట రాలేదు. అశోకవనం దీనిముందు తీసికట్టే.

"ధన్యురాలివి శూర్పణఖా" అనుకుంది.

"రామ్మా లోపలికి వెళ్దాం" అంటున్న పిల్లలతో-

"నేను ఒక్కదాన్నే వెళ్తాను. మీరు సాయంత్రం వరకూ అరణ్య విహారం చేసిరండి. కలిసి ఆశ్రమానికి వెళ్దాం".

దూరంగా ఒక స్త్రీ కనిపించింది. ఆమె ముఖం అటువైపు తిరిగి ఉన్నా, ఆకారాన్ని చూసి ఆమె శూర్పణఖే అయి ఉంటుందనుకుంది సీత.

దగ్గరగా వెళ్ళి "శూర్పణఖా" అని మెత్తగా పిలిచింది.

శూర్పణఖ వెనుదిరిగి చూసింది. ఆమె సీతను గుర్తుపట్టలేదు.

"ఎవరమ్మా నువ్వు? దోవతప్పి వచ్చావా? నా పేరెలా తెలుసు?" అనడిగింది.

"దోవ తప్పలేదు శూర్పణఖా – దోవ వెతుక్కుంటూ వచ్చాను. నేను సీతను".

శూర్పణఖకు నోట మాటరాలేదు.

సీత. ఈమె సీత. ఎంత మారిపోయింది!

ఒంటినిండా నగలతో భారంగా ఉండే సీతే తనకు తెలుసు. అదీ ఎక్కువ సేపు చూడనే లేదు.

రావణుణ్ని సంహరించి ఆర్య సామ్రాజ్యాన్ని దక్షిణాపథమంతా విస్తరించిన సర్వంసహా చక్రవర్తి శ్రీరామచంద్రుడి పట్టమహిషి సీత ఈమెనా?

శూర్పణఖ నమ్మలేక పోతోంది.

ఈ నారచీరెలేమిటి? ఈ పూలదండల నగలేమిటి?

ఎండకు కంది కమిలిన ఆ బంగారు ఛాయ ఏమిటి?

ఈమె సీతా! శ్రీరాముడి భార్య సీతేనా?

"సీతా – అంటే శ్రీరామచంద్రుని –"

శూర్పణఖను మధ్యలోనే ఆపేసి

"నేను సీతను. జనకుని కుమార్తెను. జానకిని. భూపుత్రిని" అంది అభిమానంతో.

"మరి శ్రీరాముడు" శూర్పణఖకంతా అయోమయంగా ఉంది.

"శ్రీరాముడు నన్ను పరిత్యజించాడు. ప్రస్తుతం వాల్మీకి ఆశ్రమంలో ఉంటున్నాను".

శూర్పణఖకు నోటమాట రాలేదు. శ్రీరాముడు సీతను పరిత్యజించటమా – సీతారాముల ప్రేమ ఆమెకు తెలిసినంత బాగా మరెవరికీ తెలియదు. దానికి ఆమె చెల్లించిన మూల్యం తక్కువది కాదు.

శ్రీరాముడిని ప్రేమించిన స్త్రీలకు వేదన తప్పదా?

సీత ముఖంలో శూర్పణఖకు శాంతగంభీరతలు తప్ప వేదనా ఛాయలు కనిపించ లేదు.

సీత చాలా ఎదిగింది అనుకుంది శూర్పణఖ.

"నిన్న మా పిల్లలు మీ ఉద్యానవనం చూశారు. నిన్నూ చూశారు. ఇవాళ వాళ్ళే నన్నిక్కడికి తీసుకొచ్చారు. నీ తోట ఎంతో అందంగా, హాయిగా ఉంది" చిరునవ్వుతో చెప్పింది సీత.

"ఆ చిన్నారులు నీ కుమారులా. ఎంత ముచ్చటగా ఉన్నారో" అంది శూర్పణఖ.

సీత ముఖంలో ఓ క్షణం చిన్న గర్వం కదలాడి మాయమైంది. అది శూర్పణఖ దృష్టిని దాటిపోలేదు.

"ఈ తోటలో మొక్కలూ, లతలూ, తరువులూ అన్నీ నా బిడ్డలే" అంది శూర్పణఖ.

"ఔను. అందుకే అంత మనోహరంగా ఉన్నాయి" ఒప్పుకుంది సీత.

శూర్పణఖ కళ్ళల్లో గర్వం గర్వంగా వచ్చి నిల్చింది.

"చెప్పు శూర్పణఖా – నీ జీవితం ఎలా ఉంది?"

"ఈ వనమంత అందంగా, ఆనందంగా ఉంది".

"నాకు సంతోషంగా ఉంది శూర్పణఖా. నీకు జరిగిన అవమానానికి నువ్వు ఏమై పోతావో అనుకున్నాను. నీ సౌందర్యకాంక్ష నాకు తెలుసు. నీ కురూపితనాన్ని నువ్వు భరించగలవా? భరించలేక ఏ అఘాయిత్యం చేసుకున్నావోనని నీవు జ్ఞాపకం ఒచ్చినప్పుడల్లా బాధపడేదాన్ని".

తన వంక చూసిన సీత కళ్ళల్లోని దయకూ, ప్రేమకూ కరిగిపోయింది శూర్పణఖ.

వారిద్దరి హృదయాలలో స్నేహభావం అంకురించి వారి శరీరాలు పులకించాయి.

"నువ్వు ధైర్యసాహసాలు గల దానివి" అంది సీత.

మనస్ఫూర్తిగా సీత అన్న ఆ మాట శూర్పణఖ మనసులో ఉద్వేగాన్ని నింపింది. తన జీవిత గమనాన్ని సీతకు చెప్పాలనే స్నేహార్తి హృదయంలో మొలకెత్తింది.

"నన్నిప్పుడు ఇలా చూసి ఇదంతా తేలికగా జరిగిందనుకోకు సీతా. జీవితాన్ని ఎదుర్కోవటంలోనే రాటుదేలాను. అందానికి అర్థం తెలుసుకోవటంలోనే ఆనందాన్ని పొందగలిగాను.

విరూపినైన తొలిరోజులలో బతుకు దుర్భరంగానే ఉండేది.

నా రూపం నాకే అసహ్యమనిపించేది. నన్ను నేను ద్వేషించుకునే దాన్ని. ప్రాణాలు తీసుకుందామని ప్రయత్నించిన రోజులూ ఉన్నాయి.

నాకు సౌందర్యం కావాలి. ప్రేమ కావాలి. ఆ రెండూ లేకుండా నేను బ్రతకలేను. అలాంటి నేను కురూపినయ్యాను.

నా రూపం చూసి పురుషులు, నేను మోహించిన అందమైన పురుషులు నన్ను అసహ్యించుకునేవారు.

ఇక ఎందుకీ బతుకు అనుకున్నాను. ఆ రోజులు నరకప్రాయంగా ఉండేవి. నా మనసు నిత్యం బాధతో కోపంతో రగులుతుండేది. శ్రీరాముడినీ, అతని తమ్ముడినీ, నిన్నూ ఎంత శపించానో. విషం కురిపించాను మీమీద. నా మనసులో ప్రేమ లేశమైనా లేకుండా ద్వేషమే పీఠం వేసుకుని కూచుంది. అందాన్ని ప్రేమించే నేను అందమైన ప్రతిదాన్నీ ద్వేషించటం మొదలుపెట్టాను. నా సౌందర్యకాంక్ష సౌందర్యవతులపై అసూయగా మారింది.

నేనొక నడిచే అగ్నిపర్వతాన్నయ్యాను. ఎగసిపడే దుఃఖ సముద్రాన్నయ్యాను".

బాధామయమైన శూర్పణఖ జ్ఞాపకాలతో ఇద్దరి మనసులూ బరువెక్కాయి.

"అంత బాధనుంచీ ఎలా బైటపడ్డావు శూర్పణఖా".

"చాలా కష్టమే అయింది. సౌందర్యానికి అసలు అర్థం కనుక్కోవటం చాలా కష్టమే అయింది. అమిత సౌందర్య గర్వితను. నా ముక్కు చూసుకుని నేనెంత మురిసి పోయేదాన్నో నీకు తెలియదు. మీ ఆర్యుల నిడుపాటి ముక్కులు నాకు విచిత్రంగా తోస్తాయి. విచిత్రంలో కూడా ఒక సౌందర్యం లేకపోలేదు. నా ముక్కు పొడవూ కాదు, అలాగని చప్పిడిదీ కాదు. ముక్కు ఎలా ఉండాలని ఆ ఈశ్వరుడు సృష్టి ప్రారంభంలో తలిచాడో అటువంటి ముక్కు నాదని నాకెంతో గర్వం. పచ్చని, తెల్లని గడ్డిపూలని నా ముక్కుకి ఆభరణాలుగా ధరించేదాన్ని. ముక్కు పుటాలకటూ ఇటూ నక్షత్రాల్లా మెరిసేవవి. నా ప్రియులు నా ముక్కుని సున్నితంగా చుంబిస్తే నాకెంతో పులకింత.

ఆ ముక్కుని కోల్పోవటమంటే ఏమిటో నాకు తప్ప మరెవరికీ అర్థంకాదు. దాన్నంతా భరించాను. విరూపంవల్ల వచ్చిన వికృతమైన ఆలోచనల భారాన్నంతా మోశాను. ఒక్కోసారి అందరినీ అన్నిటినీ రూపహీనం చేయాలనిపించేది.

ఆ కసి నుంచి బైటపడటానికీ, మళ్ళీ సౌందర్యాన్ని ప్రేమించటానికీ రూప, అరూపాల అసలు సారాంశాన్ని కనుగొనటానికీ నాతో నేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది.

ఆ యుద్ధంలో నాకు సహకరించినది ఈ అనంత ప్రకృతి.

ప్రకృతికి రూప, కురూప అనే తేడాలేదని గ్రహించటానికి చాలా కష్టపడ్డాను. అనేక ప్రాణులను గమనించాను. స్తబ్ధత, చలనంలలోని ఏక రూపతను గమనించాను. రంగుల రహస్యాలు కనుగొన్నాను. ఈ విషయంలో నాకు గురువెవరూ లేరు. నాకు నేనే సాధన చేశాను. ప్రకృతిలోని ప్రతి అణువునూ శోధించాను. ఆ శోధనలో నా కళ్ళే మారిపోయాయి. నా కంటికి ప్రతిదీ అందంగానే కన్పించింది. నాతో సహా ప్రతిదాన్నీ అసహ్యించుకునే నేను నాతో సహా ప్రతిదాన్నీ ప్రేమించ సాగాను.

తోటి పక్షులు ఏదో కారణాన పొడిచి పొడిచి ఈకలు పీకిన చిన్ని పక్షి నాలో కలిగించిన స్పందన ఎంత ప్రేమభరితమో అంత సౌందర్య పూరితమని గ్రహించ టానికీ, ఆ స్పందనను పట్టుకుని అర్థం చేసుకోటానికీ నేను చేసిన సాధన అసామాన్య మైనది.

క్రమంగా నా చేతులను ప్రేమించటం నేర్చుకున్నాను. ఆ చేతులతో సృష్టించటం, శ్రమించటం, సేవించటం నేర్చుకున్నాను. ఇదంతా జరగటానికి పది సంవత్సరాల పైనే పట్టింది. పది సంవత్సరాల కఠోర దీక్ష, శ్రమ ఫలించాక ఈ తోటను పెంచటం మొదలుపెట్టాను".

తన జీవన యాన సత్య సౌందర్యాన్ని సీతముందు పరిచింది.

"నువ్వెంత అందంగా ఉన్నావు శూర్పణఖా. నీ అందాన్ని ఏ పురుషుడూ గ్రహించ లేక పోవచ్చు కానీ"

సీత కంఠం రుద్ధమైంది.

తన అగ్నిపరీక్ష కంటే శూర్పణఖ గురైన పరీక్ష తక్కువది కాదు అనుకోగానే సీత కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

శూర్పణఖ హాయిగా అందంగా ఆనందంగా నవ్వింది.

"పురుషులకు మాత్రం కళ్ళుండవా? మనసుండదా? కురూపులను చేయటం, వారిని అసహ్యించుకోవటం మాత్రమే తెలిసిన పురుషుల గురించి కాదు".

"అంటే –" సీత ఆగినా ఆమె అభిప్రాయం తెలిసింది.

"నీ ఊహ నిజమే సీతా. నాకొక పురుషుని సాహచర్యం దొరికింది. నా చేతుల్లోంచి ప్రకృతిలోకి ప్రవహించే సౌందర్యాన్ని కొద్దిసేపు తనది చేసుకుని, తనను నాకర్పించు కునే అదృష్టవంతుడు ఉన్నాడు" అంటూ శూర్పణఖ గొంతెత్తి సుధీరా అని పిల్చింది.

సార్థక నామధేయుడైన ఒక దృఢకాయుడు అక్కడికి వచ్చాడు.

"ఈమె సీత".

సుధీరుడు గౌరవంగా నమస్కరించాడు.

"సీతకు నిన్ను చూపాలనే పిల్చాను".

ఆ మాటతో సుధీరుడు వెనుదిరిగి వెళ్ళిపోయాడు. ఆ చిన్న చర్యతో ఇంతవరకూ ఏ స్త్రీ పురుషుల మధ్యా తను చూడని బంధమేదో వీరిమధ్య ఉన్నట్లనిపించింది సీతకు.

"నీ జీవితాన్ని సఫలం చేసుకున్నావన్నమాట".

"సాఫల్యానికి అర్థం పురుషుని సాహచర్యంలో లేదని గ్రహించాను. అది తెలిశాకే నాకీ పురుష సాహచర్యం కలిగింది".

సీత శూర్పణఖ మాటలు జాగ్రత్తగా వింటోంది. ఏదో వివేకం, గాంభీర్యం ఆమె మాటల్లో. మరీ మరీ వినబుద్ధేస్తుంది.

"సీతా - నువ్వు".

"కుమారుల పెంపకంలో నా జీవితం సార్థకమవుతోంది".

"అదే నీ జీవితాదర్శమా?"

"ఔను. నేను రాముని పత్నిని. పట్టమహిషిగా నా బాధ్యతలు నెరవేర్చ లేకపోయాను. రామరాజ్యానికి వారసులనైనా అందించాలిగా".

"ఎన్నడూ రాజ్యంలో ఉండకపోయినా నీ జీవితం రాజ్యంతో ఎలా ముడిపడి పోయిందో కదా సీతా".

"రాజపత్ని నయ్యాక తప్పదు గదా" నవ్వింది సీత.

"ఎందుకో నాకు మొదటినుంచీ రాజ్యమంటే భయం. నా అన్న ఎంత చెప్పినా లంకా నగరంలో ఉండేదాన్ని కాదు. అరణ్య విహారంలో హాయి మరింకెక్కడా దొరకదు".

"నాకూ అరణ్య వాసమే ప్రియం. రాముడు పరిత్యజించినా ఈ వనవాసం నా క్లేశాన్ని తగ్గించింది".

వారి మాటల్లో సమయం తెలియకుండా గడిచిపోయింది.

"నా బిడ్డలకు వారు శ్రీరాముని తనయులని తెలియదు. నేను చెప్పలేదు. సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది".

"తెలిశాక వారిక అరణ్యంలో క్షణమైనా ఉంటారా?"

శూర్పణఖ సీతవంక జాలిగా చూసింది.

"వారికి అరణ్యవాసం ఇష్టమే" బలహీనంగా అంది సీత.

"వారికి ఇష్టం కావొచ్చు. కానీ రాజ్యానికి అరణ్యమంటే ఏం ప్రేమ? నగరాల అభివృద్ధి కోసం, నాగరీకుల రక్షణ కోసం అరణ్య పుత్రులు తరలిపోక తప్పదేమో".

తప్పదని సీతకూ తెలుసు.

"అప్పుడేం చేస్తావు. ఒక్కతివి వాల్మీకి ఆశ్రమంలోనే ఉండిపోతావా?"

"లేదు శూర్పణఖా. నా తల్లి భూదేవి ఆశ్రయం పొందుతాను".

"నీ తల్లి ఎక్కడ లేదని సీతా - అయితే నీ తల్లికి ఇంతకంటే సుందర రూపం మరెక్కడా లేదని నా ఉద్దేశం".

గర్వంగా తోటంతా కలయజూసింది శూర్పణఖ.

శూర్పణఖ ఉద్దేశం అర్థమైనట్లు నవ్వింది సీత. ఆ అయాచిత ఆదరణకు సీత మనసు ఉప్పొంగింది. సహోదరీ భావం మనసంతా నిండింది.

"తప్పక వస్తాను శూర్పణఖా. నా బిడ్డలు నన్నొదిలి నగరానికి వెళ్ళాక నేను భూపుత్రిక నవుతాను. ఈ చల్లని తరువుల నీడన సేదదీరుతూ జీవితానికో కొత్త అర్థం కల్పించుకుంటాను".

పిల్లలు రావటంతో వారి సంభాషణ ఆగింది.

శూర్పణఖ వారికి మధురఫలాలను అందించింది. వాళ్ళు ఆప్యాయంగా ఆరగించారు.

"ఎవరమ్మా ఆవిడ" మార్గమధ్యంలో తల్లిని అడిగారు.

"నాకు చాలా కావలసిన మనిషి నాయనా. ఎంతో ఆప్తురాలు".

"మరి మాకెప్పుడూ చెప్పలేదేమమ్మా".

"సమయం వచ్చినప్పుడు అన్నీ తెలుస్తాయి. కానీ ఈ అరణ్యంలో ఈ ఉద్యాన వనానికి దోవ మాత్రం ఎన్నడూ మర్చిపోకండి. మీరు ఎక్కడికి వెళ్ళినా, ఏం చేసినా ఈ దోవ మాత్రం మర్చిపోకండి. మర్చిపోరు కదూ".

"మర్చిపోమమ్మా" తల్లికి మాట ఇచ్చారు లవకుశులు.

ఆదివారం ఆంధ్రజ్యోతి, 4 మే 2003